సాక్షి ప్రకాశం
బుధవారం । 21 । మే । 2025



గంజాయి మత్తు.. యువత చిత్తు!

పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో గంజాయి వ్యాపారం చాప కింద నీరులా విస్తరిస్తోంది.

- 8లో..



సెల్ టవర్ ఎక్కిన యువకుడు

పోలీసులు కేసు నమోదు చేయడం లేదని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28 /26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

26 నుంచి వ్యాక్సిన్ డ్రైవ్

ఒంగోలు టౌన్: మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ ప్రత్యేక కార్యక్రమాన్ని మే 26న ప్రారంభించి, జూలై 26వ తేదీ వరకు వ్యాక్సిన్లు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాక్సిన్లతో ప్రమాదకర న్యూమోనియా, అతిసార, మెదడుకు సంబంధించిన వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. 9 నుంచి 12 నెలల మధ్య మొదటి డోసు, 16 నుంచి 24 నెలల మధ్య రెండో డోసు వేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ నిర్దేశిత సమయంలో టీకాలు వేయించని 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ ప్రత్యేక కార్యక్రమంలో తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. మే 26 నుంచి 31 వరకు మొదటి రౌండ్, జూన్ 23 నుంచి 28 వరకు రెండవ రౌండ్, జూలై 21 నుంచి 26 వరకు మూడో రౌండ్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో టీకాలు వేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీలు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ యాజమాన్యాల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పనిసరిగా బదిలీ అయ్యేవారు, అభ్యర్థన బదిలీ కోరుకునే వారు ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరిలో బదిలీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మెడికల్ బోర్డు చెకప్‌కు హాజరు కాకుంటే..వెంటనే మెడికల్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం



నిరసన ప్రదర్శన చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాలు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని అఖిలపక్ష కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా పోరాటలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా సర్క్యులర్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఉమ్మడి పోరాటాల ద్వారా కేంద్రం కుట్రలను తిప్పి కొడతామని స్పష్టం చేశారు. దేశంలోని కార్మికులు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో దయనీయ స్థితిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా హక్కులు కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు వీరా రెడ్డి, పి.కల్పన, చీకటి శ్రీనివాసరావు, హనుమంతు, రాజశేఖర్, దాసరి సుందరం, తంబి శ్రీనివాసరావు, జార్జి, సారధి పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

ఒంగోలు సిటీ: మాతృభాషలో విద్యా బోధన చేయడంతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుంచి 8 తరగతులు బోధించే ప్రాథమికోన్నత స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులను తొలగించడం, తెలుగు మాధ్యమం లేదని ఉత్తర్వులు ఇవ్వడం కూటమి ప్రభుత్వానికి తగదని ఆక్షేపించారు. కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు మాధ్యమాన్ని విస్మరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. విద్యార్థులు మాతృభాషలో చదువుకుంటే సులభంగా నేర్చుకొని భావ వ్యక్తీకరణ చేయగలుగుతారని, తెలుగు మాధ్యమం కొనసాగించి పిల్లలు వారికి ఇష్టమైన మాధ్యమాన్ని ఎంచుకునే విధంగా అవకాశం ప్రభుత్వం కల్పించాలన్నారు.

సంక్షేమం

ముక్కలు చెక్కలు

రేషనలైజేషన్ పేరుతో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని కుదించాలని కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయం రెవెన్యూ శాఖను ఓ కుదుపు కుదిపింది. సచివాలయ ఉద్యోగులను మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ అనే మూడు కేటగిరీలుగా విభజిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషనలైజేషన్ తర్వాత మిగులుగా ఉన్నవారిని ఎక్కడ, ఎలా వినియోగిస్తారనే స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం ముందుకెళ్తున్న తీరు ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుండగా, సేవలు సక్రమంగా అందవేమోనని ప్రజలు అనుమానిస్తున్నారు.

- రెవెన్యూ వ్యవస్థ రెక్కలు విరిచేలా కూటమి ప్రభుత్వం అడుగులు
- సచివాలయాలను క్లస్టర్లుగా విభజిస్తూ జీవో నంబర్ 4 విడుదల
- ప్రస్తుతం ఒక్కో సచివాలయానికి ఒక వీఆర్వో, ఒక సర్వేయర్
- కొత్త జీవో ప్రకారం రెండు సచివాలయాలకు కలిపి ఒక్కరే వీఆర్వో
- జిల్లాలో మిగులు ఉద్యోగులుగా 285 వీఆర్వోలు, 278 మంది సర్వేయర్లు
- పని భారం పెంచొద్దని, అర్హులకు ప్రమోషన్ ఇచ్చి రేషనలైజ్ చేయాలని డిమాండ్



కంభం: రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వీఆర్వోలు ఆందోళనకు గురవుతున్నారు. సచివాలయాలను క్లస్టర్లుగా విభజించడంతోపాటు సిబ్బందిని రేషనలైజేషన్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18వ తేదీన జీవో నంబర్ 4 విడుదల చేసింది. దీని ప్రకారం జనాభా ప్రాతిపదికన రెండు లేదా మూడు గ్రామ/వార్డు సచివాలయాలను ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఉద్యోగుల సంఖ్యను సైతం కుదిస్తున్నారు. ఈ విధానంపై రెవెన్యూ శాఖలోని వీఆర్వోలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం ఒక సచివాలయంలో ఒక వీఆర్వో, ఒక సర్వేయర్ పనిచేస్తుండగా నూతన విధానంలో మాత్రం ఆ క్లస్టర్‌లోని ఒక సచివాలయంలో వీఆర్వో, మరోదానిలో సర్వేయర్ ఉంటారు. ఈ లెక్కన జిల్లాలో 353 మంది వీఆర్వోలు, 278 మంది సర్వేయర్లను మిగులు సిబ్బందిగా చూపుతున్నారు. మిగులు సిబ్బందిని ఎక్కడ సర్దుబాటు చేస్తారో ప్రభుత్వం గానీ, ఉన్నతాధికారులుగానీ స్పష్టత ఇవ్వకపోవడంతో వారంతా సతమతమవుతున్నారు. గతంలో ఏఆర్ఐ పోస్టులను తొలగించి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు కేటాయించిన నేపథ్యంలో సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రస్తుతం వీఆర్వోలను తగ్గించాలని నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో మండలంలోని సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మిగులు ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నారు.

పదోన్నతి కోసం ఎదురుచూపులు

వీఆర్వోలను పాత విధానంలోనే కొనసాగించాలని వీఆర్వోలు కోరుతున్నారు. ఇప్పటికే చాలా మంది వీఆర్వోలు ప్రమోషన్ పొందేందుకు అర్హులైన వారు సర్కారు నిర్ణయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. డిగ్రీ విద్యార్హత కలిగి శాఖాపరమైన పరీక్షలు, సర్వే శిక్షణ, సీపీటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అందరికీ సీనియారిటీ ప్రకారం ఏక కాలంలో సీనియర్ అసిస్టెంట్ లేదా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించాలన్నది వీఆర్వోల డిమాండ్. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్ వేతనం పొందుతున్న సీనియర్ వీఆర్వోలకు ప్రమోషన్ ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు చెబుతున్నారు. మిగులుగా ఉన్న వీఆర్వోలకు రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు సృష్టించి పదోన్నతి కల్పించాలని కోరుతున్నారు.

గ్రామ/వార్డు సచివాలయాలు	719
రేషనలైజేషన్‌తో అందుబాటులో ఉండే వీఆర్వోలు	366
మిగులు వీఆర్వోలు	353
రేషనలైజేషన్‌తో అందుబాటులో ఉండనున్న సర్వేయర్లు	306
మిగులు సర్వేయర్లు	278



గిద్దలూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్వోలు(ఫైల్)

రైతులకు ఇక్కట్లు

సచివాలయానికి ఒక వీఆర్వో, ఒక గ్రామ సచివాలయ సర్వేయర్ అందుబాటులో ఉంటేనే రైతులకు, ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందడం లేదని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమిస్తే భూ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజలకు, రైతులకు మేలు చేసేలా ఉండాలే కానీ కొత్త సమస్యలు పెంచేలా ఉండకూడదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వీఆర్వోలకు న్యాయం చేయాలి



అర్హత ఉండి ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న వీఆర్వోలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి. మిగులు ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ వ్యవస్థ మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన సేవలందించేలా చూడాలి.

– అన్వర్ బాషా, సీఐటీయూ నాయకుడు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమిస్తే ప్రజా సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఏర్పడతాయి. సచివాలయానికి ఒక వీఆర్వో ఉంటేనే సమస్యలు పరిష్కారం కాక రైతులు, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విధానంలోనూ ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వోను కొనసాగించాలి.

– నెమలిదిన్నె చెన్నారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శం



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య పోరాటంలో, దేశాభివృద్ధిలో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ కుమార్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ సీహెచ్.ఓబులేసు, కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సీఈఓ శ్రీమన్నారాయణ, ప్రకాశం భవనంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్ : బ్రిటీష్ ముష్కరుల తుపాకులకు ఎదురొడ్డి గుండె తీసి చూపించిన ధీరుడు, స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు వాడి దమ్ము చాటి చెప్పిన సాహసి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరిచిపోదని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రకాశం పంతులు వర్ధంతి నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ఎన్నో సేవలు చేశారని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, సీసీఎస్ సీఐ జగదీష్, ఆర్ఐ రమణారెడ్డి, ఏఆర్ ఎస్సైలు ప్రసాద్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు వేలం అడ్డగింత

- లో గ్రేడ్ కొనుగోలు చేయడం లేదని రైతుల ఆగ్రహం
- రోజు రోజుకూ ధరలు పతనమవుతున్నాయని మండిపాటు
- కంపెనీ ప్రతినిధులతో చర్చల అనంతరం తిరిగి ప్రారంభం

టంగుటూరు: 'లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదు. మీడియం రకం పొగాకుకు రోజు రోజుకు ధరలు తగ్గిస్తున్నారు. పెరిగిన పెట్టుబడులకు మీరు ఇస్తున్న ధరలకు ఏమాత్రం పొంతనం ఉండటం లేదు. ధరలు తగ్గించుకుంటూ పోతే మేం ఎలా బతకాలంటూ' పొగాకు రైతులు వేలాన్ని అడ్డుకున్నారు. టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం పొందూరు, ఆలకూరపాడు గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. అయితే వేలం ప్రారంభం తరువాత ధరలను చూసిన రైతులు ఆగ్రహంతో వేలాన్ని అడ్డుకున్నారు. మీడియం రకం పొగాకుకు కేవలం రూ.205 వేయడాన్ని రైతులు మండిపడ్డారు. గత ఏడాది ఇదే రకం పొగాకును రూ.360లకు కొనుగోలు చేశారని, ఇప్పుడు ఇంత తక్కువ ధరలు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. దీంతో ఆర్ఎం లక్ష్మణరావు కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. అరగంట పాటు రైతు నాయకులు, రైతులతో చర్చల అనంతరం వేలాన్ని కొనసాగించారు. రైతులు వేలానికి 447 బేళ్లను తీసుకురాగా 362 బేళ్లను కొనుగోలుచేసి 85 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.241.20గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయి.



టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఒకే ఫొటోతో 50 మందికి మస్టర్

- ఉపాధిహామీలో చిత్రవిచిత్రాలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

మార్కాపురం:

నిన్న కొనకనమిట్ల... నేడు మార్కాపురం... కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కూటమినాయకుల పెత్తనం వెరసి ఉపాధి హామీ పథకం చిత్ర విచిత్రంగా జరుగుతోంది. ఏరోజు ఎవరికి ఎలా మస్టర్ వేస్తారో.. ఆ దేవుడికి కూడా అర్థం కావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టం వచ్చినట్లుగా ఫొటోలు తీసి అప్‌లోడ్‌చేస్తూ కూటమి నాయకుల మెప్పు పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే. మండలంలోని బోడపాడు గ్రామంలో రామన్నకుంటలో నీటికుంట తవ్వేందుకు పనులు చేపట్టారు. అయితే ఒకే ఫొటోతో 50 మందికి మస్టర్లు వేయడం పెద్దఎత్తున విమర్శలకు తావిస్తోంది. ఫీల్డు అసిస్టెంట్ కె.శ్రీనివాసులు ఒకే ఫొటోతో 50 మందికి మస్టర్లు వేసి అప్‌లోడ్ చేశారు.

పనికి హాజరైన కూలీల ఫొటోలనే అన్నీ మస్టర్లకు చూపడం గమనార్హం.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కేవలం అధికారపార్టీ నాయకుల జేబులు నింపేందుకే ఉపాధిహామీ పథకం తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలను వదిలి బయటకు రాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు వేసిందే మస్టరు... పంపిందే ఫొటో... వచ్చిందే వేతనం.. లాగా తయారైంది. కూలీలు రాకపోయినా, మస్టర్ వేస్తూ కమీషన్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పథకం నిర్వహణపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారు. అలా జరిగిందా.. జరగదే.. చూస్తాంలే అంటూ సమాధానాలు దాటవేస్తున్నారు. కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. పనులకు రాకపోయినా వచ్చినట్లుగా మస్టర్ వేసి వారి వద్ద నుంచి కమీషన్లు తీసుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

అలా జరిగే అవకాశం లేదు:ఏపీఓ

ఈ విషయమై మార్కాపురం ఏపీఓ నాగరాజును వివరణ కోరగా అలా జరిగే అవకాశం లేదని, కూలీలు హాజరైనా హడావుడిలో ఒకే ఫొటోతో మస్టర్ వేసి ఉండవచ్చని, అయినా కచ్చితంగా విచారణ చేస్తానని చెప్పారు.





ఒకే ఫొటోతో వేసిన మస్టర్

భూ సేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లా నుంచి వెళుతున్న ప్రధాన రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన రహదారులు, రైల్వే మార్గాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేసుకొని పూర్తి చేయాలన్నారు. 565, 544(డీ), 167 (బి), 765, 544 (జి) జాతీయ రహదారులు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గాల నిర్మాణ ప్రాజెక్టులపై చర్చించారు. ఆయా నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ కోసం నిధుల చెల్లింపు, పెండింగ్ క్లెయిమ్స్, యాజమాన్య హక్కుల వివాదాలపై కలెక్టర్ ఆరా తీశారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. వీటి పురోగతిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, నిధుల చెల్లింపులపై కలెక్టర్ ఆరా తీశారు. కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు భూ సేకరణపై సమావేశంలో చర్చించారు. పాదర్తి, గుండాయపాలెం, పిన్నివారిపాలెం తదితర గ్రామాల్లో భూముల లభ్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవసరాన్ని బట్టి వాటిని సేకరించే విషయంలో ఒక స్పష్టత తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో డీఆర్ఓ బి.చినఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఎస్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)



- గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న యువకులు, విద్యార్థులు
- మత్తుకు బానిసలుగా మారుతున్న మైనర్లు
- పశ్చిమ ప్రకాశంలో చాప కింద నీరులా గంజాయి వ్యాపారం
- వ్యసనం నుంచి వ్యాపారంగా మారుతున్న వైనం
- గడిచిన వారంలో మూడున్నర కేజీల గంజాయి పట్టుకున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు
- రెండు చోట్ల ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

గంజాయి మత్తు.. యువత చిత్తు!

కంభం: పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో గంజాయి వ్యాపారం చాప కింద నీరులా విస్తరిస్తోంది. మైనర్లు, విద్యార్థులు సైతం గంజాయికి బానిసలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించకపోవడం, అవసరాన్ని మించి డబ్బు అందజేయడం, మితిమీరిన స్వేచ్ఛ తదితర కారణాలతో విద్యార్థులు, యువకులు పెడదారి పడుతున్నారు. మత్తుకు బానిసలుగా, గంజాయి విక్రేతలుగా మారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

వ్యసనం నుంచి వ్యాపారం వరకు..

కూలి పనులకు వెళ్లే వారు, సాధువులు, మద్యానికి బానిసలైన వారు ఎక్కువగా గంజాయి వినియోగిస్తుంటారు. క్రమేపీ విద్యార్థులు, మైనర్లు సైతం గంజాయికి బానిసలుగా మారిపోతున్నారు. కొందరు యువకులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి ప్యాకెట్లలో నింపి విక్రయించగా వచ్చిన డబ్బును జల్సాలకు, విలాసాలకు వినియోగించుకుంటున్నారు.

పశ్చిమ ప్రకాశంలో జోరుగా..

గంజాయి కేసుల్లో గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు చెందిన పలువురు యువకులు, వ్యక్తులు పోలీసులకు పట్టుబడటం ఈ ప్రాంతంలో గంజాయి దందా జోరుగా సాగుతోందన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది జూలైలో ఎక్సైజ్, విజిలెన్స్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించిన సమయంలో కంభం హైవే రోడ్డు వెంట ఉన్న ఓ లాడ్జిలో ముగ్గురు యువకులు మత్తు మాత్రలు, గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. అదే రోజు సాయంత్రం యర్రగొండపాలెంలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని 330 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు తాజాగా ఈనెల 15వ తేదీన యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువులో ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి 1.60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకునిని వారిని రిమాండ్‌కు తరలించారు. అదే రోజు బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో ఓ సాధువు, కంభం, బేస్తవారిపేటకు చెందిన ఇద్దరు యువకుల నుంచి 2 కేజీలకు పైగా గంజాయిని కంభం సీఐ మల్లికార్జున సీజ్ చేశారు. కంభంలో మూడు రోజుల్లో సుమారు 15 మంది యువకులను అదుపులోకి తీసుకొని విచారించి, గంజాయి కొనుగోలు చేసిన ముగ్గురిని జైలుకు పంపారు. వీరిలో ఇద్దరు నిందితులు గతంలోనూ గంజాయి కేసులో పట్టుబడినట్లు సమాచారం. 5 నెలల క్రితం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గంజాయి తరలిస్తున్న కొందరిని అక్కడి పోలీసులు పట్టుకోగా అందులో కంభం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు చిక్కిన విషయం పాఠకులకు విధితమే. వైజాగ్, వినుకొండ, నంద్యాల, కనిగిరి ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు రెండు, మూడు కేజీల చొప్పున గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా ఇక్కడ కొనుగోలు చేసిన వారు చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలోకి మారుస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.200 నుంచి రూ.300 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి దందా సాగించే వారు హైవేలో, ఊరికి దూరంగా ఉన్న లాడ్జిలను తమ స్థావరాలుగా చేసుకుంటున్నట్లు తెలిసింది.



విక్రయించేందుకు సిద్ధం చేసిన గంజాయి ప్యాకెట్లు(ఫైల్)

పిల్లలను గమనిస్తున్నారా?

యువకులు, పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలను బట్టి వారు డ్రగ్స్, గంజాయి తీసుకుంటున్నారని కనిపెట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. మత్తుకు అలవాటుపడిన వారు చదువు, పని మీద దృష్టి పెట్టలేరని, ఆహారం సరిగ్గా తినకపోవడం, బరువు తగ్గడం, చిరాకు పడటం, గదికే పరిమితి కావడం, మాటలకు చేతలకు పొంతన లేకపోవడం, జ్ఞాపక శక్తి తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి



విద్యార్థులు చదువుకోవాల్సిన వయసులో గంజాయి, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై నేరస్తులుగా మారిపోతున్నారు. గంజాయి కేసులో పిల్లలు మొదటిసారి పట్టుబడితే ఒంగోలులోని రిహాబిలిటేషన్ సెంటరుకు పంపించి కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. రెండోసారి పట్టుబడితే కేసు నమోదు చేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎవరైనా గంజాయి సేవిస్తున్నా, విక్రయాలు జరుపుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– కె.మల్లికార్జున, కంభం సీఐ

సెల్ టవర్ ఎక్కిన యువకుడు



సెల్ టవర్ ఎక్కిన సురేష్



టవర్ దిగిన సురేష్‌ను తీసుకొని వెళ్తున్న పోలీసులు

- పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతోనే..
- న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దిగివచ్చిన వైనం

యర్రగొండపాలెం: పోలీసులు తాను ఇచ్చిన కేసు నమోదు చేయడం లేదని స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన అలేటి సురేష్ మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే..సురేష్ పట్టణంలోని ఇద్దరు వ్యాపారుల వద్ద నుంచి కొంతమేర అప్పు తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించడం లేదని వారు అతన్ని తీవ్రంగా హింసించడంతో పాటు దాడి చేశారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ దాడిలో అతని కుడిచేయి విరిగిపోయింది. దీంతో సురేష్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు ఈ కేసును తీసుకోకుండా నిందితులను పిలిపించి విచారిస్తామని చెప్పి అతన్ని పంపించేవారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో ఆ యువకుడు సెల్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. లేకుంటే దూకి ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించాడు. కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అతను కిందికి దిగివచ్చాడు.



కిందికి దిగమని మైక్‌ద్వారా చెప్తున్న పోలీసులు

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంపై లోతుగా సమీక్షించారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూ అప్పగించి, రీ సర్వే, రెవెన్యూ సర్వీసులు, వాటర్ టాక్స్ తదితర అంశాలపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత తహసీల్దార్లతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ చట్టాలు, రెవెన్యూ అంశాలపై అధికారులు పూర్తి అవగాహనతో పనిచేయాలన్నారు. రెగ్యులరైజేషన్ స్కీం 2025 ప్రక్రియపై రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అందుకనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో వాటర్ టాక్స్ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి స్థల పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. భూముల రీ సర్వేలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, వెంకట శివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు వరకుమార్, సత్యనారాయణ, శ్రీధర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్, వివిధ సెక్షన్స్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బంగారు దుకాణంలో చోరీ

- 40 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

కనిగిరిరూరల్: పట్టణంలోని బోడ్డుచావిడి సెంటర్‌లో ఉన్న అచ్చుత పద్మ శివ జ్యూయలరీ షాపులో మంగళవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జ్యుయలరీ షాపు యజమాని అచ్చుత పద్మ సొంత పనులపై తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లగా దుండగులు షాపులోకి ప్రవేశించి షాపులోని సుమారు 40 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఈ మేరకు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సైలు టీ శ్రీరాం, మాధవరావులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నలుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం: మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామ శివార్లలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.45,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

హిందీ పరీక్షకు 215 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు రెండో రోజు హిందీ పరీక్షకు 215 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 286 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 71 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం జరిగాయి. ఇంటర్‌కు తెలుగు పరీక్షకు మొత్తం 1013 మంది విద్యార్థులకు గాను 838 హాజరు కాగా 175 మంది గైర్హజరయ్యారు. హిందీ పరీక్షకు 14 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 653 మంది విద్యార్థులకు గాను 511 మంది హాజరుకాగా 142 మంది గైర్హజరయ్యారు. డీఈఓ కిరణ్‌కుమార్ 12 కేంద్రాలను పరిశీలించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

- ప్రమాదంలో డ్రైవర్ మృతి

త్రిపురాంతకం: వేగంగా వెళ్తున్న లారీ రోడ్డు పక్కన ఇంట్లోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై మేడపి సమీపంలో చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలంలోని ముడివేముల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వెంకటనారాయణ.. వినుకొండ వైపు నుంచి యర్రగొండపాలెం వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. లారీ అదుపు తప్పి పాత మిద్దెలోకి దూసుకెళ్లడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వెంకటనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్‌ను రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి..

- పొన్నలూరు చెరువులో పడి వ్యక్తి మృతి



శేషయ్య

పొన్నలూరు: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృత్యు ఒడికి చేరాడు. ఈ సంఘటన మంగళవారం పొన్నలూరు చెరువు వద్ద చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని పైరెడ్డిపాలెం గ్రామాకి చెందిన కొడవల్లూరి శేషయ్య(48)కు వివాహమై భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో పొన్నలూరు చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడటంతో మృతి చెందారు. చెరువు దగ్గర ఉన్న శేషయ్య వద్దకు వెళ్లిన ఆయన బంధువు.. విగత జీవిగా నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు తెలియజేశాడు. దీంతో గ్రామస్తులు వచ్చి శేషయ్య మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. శేషయ్యకు మూర్ఛ వ్యాధి ఉండటం వల్ల చేపలు పట్టే సమయంలో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని బంధువులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సైలు

- 127 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- నిందితురాలిని పట్టించిన సీసీ కెమెరాలు

మార్కాపురం: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలిగా నటిస్తూ సుమారు రూ.10 లక్షల విలువైన 127 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసిన మహిళను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా 24 గంటల్లోనే నిందితురాలిని అరెస్టు చేసి సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం సీఐ తన కార్యాలయంలో ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు కొమరోలు మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన మజ్జారి బాల వెంకటయ్య మార్కాపురం పట్టణంలో ఉన్న తన అన్న మనవడి పెళ్లికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మార్కాపురం డిపోలో దిగి తన లగేజీని చూసుకోగా బంగారు ఆభరణాలు ఉంచిన బ్యాగ్ కనిపించలేదు. ఆ బ్యాగును ఓ గుర్తుతెలియని వ్యక్తి కంభం సెంటర్‌లో దిగుతూ తీసుకెళ్లినట్లు తోటి ప్రయాణికులు చెప్పారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కంభం సెంటర్‌లో ఓ మహిళ అనుమానాస్పద కదలికలను గుర్తించి వివరాలు సేకరించారు. పట్టణంలోని జగదీశ్వరీ థియేటర్ వద్ద నివాసముండే దూదేకుల హుస్సేన్‌బీగా గుర్తించి మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి 25 గ్రాముల గోల్డ్ బ్రాస్‌లెట్, 25 గ్రాముల బంగారు చెవిదుద్దులు, 2 గ్రాముల 3 పూసల దండ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ షేక్ షరీఫ్, డి.కోటి నాయక్‌కు రివార్డులు అందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులను సీఐ సన్మానించారు.



నిందితురాలి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

సత్తా చాటిన తూర్పుగోదావరి మైసూరు ఎడ్లు



ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న మైసూరు ఎడ్ల జత

- ఆకట్టుకున్న రాష్ట్ర స్థాయి ఎడ్లబండి పరుగు పోటీలు

స్వర్ణ(కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మైసూర్ ఎడ్ల బండి పరుగు పందెం పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన వల్లూరు నరేంద్రకుమార్‌కు చెందిన మైసూర్ ఎడ్లు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. స్వర్ణమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా తిమిడెదపాడు డొంకలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 23 ఎడ్ల జతలు తమ పేర్లు నమోదు చేసుకోగా వర్షం కారణంగా కేవలం 18 ఎడ్ల జతలు మాత్రమే పాల్గొన్నాయి. ఎంపిక చేసిన రెండు కిలోమీటర్ల దూరాన్ని ఎడ్లు టైరు బండితో కలిసి పరుగెత్తాయి. మొదటి స్థానం పొందిన నరేంద్రకుమార్ ఎడ్ల జత 4 నిమిషాల 29 సెకన్ల, 69 మిల్లీ సెకన్ల సమయంలో గమ్యం చేరుకున్నాయి. తరువాత రెండో స్థానంను బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన కఠారి వేణుబాబుకు చెందిన ఎడ్ల జత 4 నిమిషాల 36 సెకన్ల, 50 మిల్లీ సెకన్లలో, మూడో స్థానం.. భవనం క్రితిక్షరెడ్డికి చెందిన ఎడ్ల జత 4.37 నిమిషాల్లో, నాలుగో స్థానాన్ని ప్రకాశం జిల్లా అల్లూరుకు చెందిన జరుగుమల్లి మోహన్‌చంద్ ఎడ్ల జత 4.38 నిమిషాల వ్యవధిలో నిర్దిష్ట గమ్యం చేరుకున్నాయి. ప్రథమ బహుమతిని గ్రామానికి చెందిన శివరామకృష్ణప్రసాద్ రూ. 20000, రెండో బహుమతి రూ. 15000ను కట్టా బుజ్జి, నక్కా పిచ్చియ్య, కొమ్మాలపాటి వెంకటేశ్వర్లు అందించారు. మూడో బహుమతి రూ. 10000 నార్నె వాసు, చైతన్య పంపిణీ చేశారు. నాలుగో బహుమతి రూ. 5000ను భాను, రోహిత్‌సాయి అందించారు. న్యాయ నిర్ణేతలుగా శివరామకృష్ణప్రసాద్, కట్టా ప్రసాద్, పూల గోపిలు వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

22న చోళ్లవీడులో బండలాగుడు పోటీలు

రాచర్ల: వేమయ్యస్వామి 263వ ఆరాధన మహోత్సవం సందర్భంగా చోళ్లవీడు గ్రామంలో ఈ నెల 22వ తేదీ న్యూ కేటగిరీ విభాగం ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు గురువారం 7 గంటలలోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.8 వేలు, ఏడో బహుమతి రూ.5 వేలు, కన్సోలేషన్ బహుమతి రూ.3 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 99129 95159, 95537 54266ను సంప్రదించాలని సూచించారు.

సబ్‌స్టేషన్‌కు పసుపు రంగు



సబ్‌స్టేషన్ భవనానికి వేసిన పసుపు రంగు

రాచర్ల: ప్రభుత్వ భవనాలకు రంగులు వేయడంపై గతంలో నానా రచ్చ చేసిన కూటమి నాయకులు.. తాము అధికారంలోకి రాగానే తాపీగా పసుపు రంగు రాస్తున్నారు. రాచర్ల మండలంలోని మేడంవారిపల్లెలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిధులు మంజూరు చేశారు. సోమిదేవిపల్లె, గుడిమెట్ట, రామాపురం, సత్యవోలు, శీలంవెంకటరెడ్డిపల్లె, సంగపేట, ఒద్దులవాగుపల్లె, మేడంవారిపల్లెలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతుండటంతో గత ప్రభుత్వం రూ.30 లోలతో సబ్‌స్టేషన్ నిర్మించింది. అప్పటి ఎమ్మెల్యే అన్నా రాంబాబు భూమి పూజ చేయగా.. కాంట్రాక్టర్ పనులు సకాలంలో పూర్తి చేశారు. సబ్ స్టేషన్ గదితోపాటు ప్రధాన గేటుకు గ్రామ కూటమి నాయకులు పసుపు రంగు వేయించడం చర్చనీయాంశమైంది. ''కడాన మీ మొహానికి రంగులేసుకోండి..'' అంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో చేసిన వ్యాఖ్యలను గ్రామస్తులు గుర్తుచేస్తూ.. మరి ఇప్పుడు పసుపు రంగు ఎలా వేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.